








# ఆ తళుకుబెళుకుల వెనక!

ఒకప్పుడు వేడుకల కోసం కొన్న బట్టల్ని మాటిమాటికీ ధరించడమే కాకుండా, తరం నుంచి తరానికి వాటిని అందజేసేవాళ్లు కూడా. పైగా పంచెల్లాంటి సంప్రదాయ దుస్తులు ధరించేవారు. ఖద్దరు, పట్టు వస్త్రాలకు ప్రాధాన్యత ఎక్కువ ఉండేది. ఇప్పుడలా కాదు. ఆ సందర్భంలో మాత్రమే ఉపయోగపడేలా, ఫొటోలలో జిగేలుమనేలా మెరిసే దుస్తులు కొంటున్నారు. ఆ తర్వాత వాటిని ఏం చేయాలో తెలియక పారేస్తున్నారు కూడా. ఇవన్నీ కూడా పాలిస్టర్ లాంటి సింథటిక్ దుస్తులు కావడం మరో విషయం. సింథటిక్ వస్త్రాలను తయారుచేయడానికి పెట్రోలియం లాంటి ఉత్పత్తులు కావాలి. వాటిని ఘనంగా, రంగురంగుల దుస్తులుగా మార్చేందుకు కృత్రిమ రంగులు, సీసం లాంటి లోహాలు ఉండాలి. ఈ ప్రక్రియ మొత్తంలో ఖర్చయ్యే నీటి శాతం కూడా చాలా ఎక్కువగానే ఉంటుంది. వాటిని ధరించిన తర్వాత కూడా మైక్రో ప్లాస్టిక్స్ విడుదల అవుతూనే ఉంటాయి. ఇంతాచేసి కొన్నాళ్లకు వీటిని పారేస్తారు. అదో పెద్ద సమస్య. ఓ నివేదిక ప్రకారం 2014 నుంచి 2023 నాటికి దుస్తుల వాడకం ఏకంగా 60 శాతం పెరిగింది. అయితే వాడేసిన దుస్తుల్లో 80 శాతం మాత్రం చెత్తకుప్పల్లోకే చేరుకుంటున్నాయి. ధనిక దేశాలైతే చిలీలాంటి చోట్లకు వీటిని తరలిస్తున్నాయి. చిలీలోని అటకామా ఎడారిలో ఓచోట 60 వేల టన్నుల దుస్తుల్ని పారేశారు. ఈ కుప్ప అంతరిక్షం నుంచి కూడా కనిపిస్తుందట!!!

## రసాయనాలతో సహజీవనం!

మన చుట్టూ ఉండే ప్రతీ పదార్థంలోనూ ఏదో ఒక రసాయనం కనిపిస్తున్నది. డియోడరెంట్లు, నెయిల్ పాలిష్ లాంటి రోజువారీ ఉత్పత్తులలో కూడా ఎండోక్రైన్ డిజ్‌రప్టింగ్ కెమికల్స్ ఉంటున్నాయి. ఇవి మన హార్మోన్లను దెబ్బతీసి... క్యాన్సర్ లాంటి తీవ్రమైన అనారోగ్యాలకు దారితీయవచ్చు. ఇక దుకాణంలో బట్టలు, పరుపులు నిలవ ఉండటానికి వాడే ఫార్మాల్డిహైడ్; పెయింట్ల తయారీలో వినియోగించే సీసం; మంటలు చెలరేగకుండా నిర్మాణ సామాగ్రిలో వాడే పీబీడీఈ, బాత్రూం శుభ్రం చేసే క్లీనర్లలో హైడ్రోక్లోరిక్ ఆమ్లం; ప్లాస్టిక్ తయారీలో కలిపే బైస్ఫినాల్... ఆఖరికి పొద్దున లేవగానే వాడే టూత్ పేస్టులో ఉండే పారాబెన్స్... అన్నీ మనకీ, పర్యావరణానికీ హాని కలిగించే రసాయనాలే!

## కంటితుడుపేమీ కాదు!

ఏటా జూన్ 5న నిర్వహించే ప్రపంచ పర్యావరణ దినోత్సవం వెనుక సదుద్దేశమే ఉంది. ఐక్యరాజ్య సమితి 1972లో మొదలుపెట్టిన ఈ రోజు ఏటా ఒక కొత్త నినాదాన్ని తలకెత్తుకుని, ఆ సమస్య మీద అవగాహన... దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నాలను ప్రోత్సహిస్తుంది. ఉదాహరణకు 2018లో పర్యావరణ దినోత్సవానికి కేంద్రంగా ముంబయి వెరసోవా బీచ్‌ని ఎంచుకున్నారు. ఆ రోజున ఆరువేల మందికి పైగా పర్యావరణ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. అక్కడ పేరుకున్న 90 వేల కిలోల ప్లాస్టిక్‌ని తొలగించారు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వం కూడా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా చర్యలు మొదలుపెట్టింది.

---

**ఇదీ సంగతి. ఇప్పుడిప్పుడే 'సుస్థిరత్వం' (సస్టెయినబిలిటీ) పేరుతో పర్యావరణానికి అనుకూలమైన వేడుకలు జరుగుతున్నాయి. కానీ అవి కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితంగా ఉన్నాయి. ఇప్పటికీ మధ్యతరగతి భేషజాల మధ్య, పేదల అవగాహనాలోపంతోను... వేడుకలు పర్యావరణానికి ఆమడ దూరంలోనే సంబరాలు చేసుకుంటున్నారు. పైగా వేడుకలు మరింత విస్తృతం అవుతున్నాయి. మెహందీ, సంగీత్ లాంటి పేర్లతో సుదీర్ఘంగా సాగుతున్నాయి. అప్పు చేసి మరీ ఆర్భాటం చేయాల్సిన పరిస్థితి. ఆ తత్వం మారుతుందనే ఆశిద్దాం. వీలైతే, ఆ మార్పు మన ఇంటి నుంచే మొదలుపెడదాం!**